



ఫోన్ చేసుకుంటానని చెప్పి..

డబ్బులు కాజేసిన సైబర్ నేరగాడు

- ఖాతాలో ఉన్న రూ.50 వేలు స్వాహా

7

ఆటగాళ్లకు శిక్షకుల్లేరు

- మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియంలో పలు క్రీడలకు లేని కోచ్‌లు
- సీనియర్ క్రీడాకారుల పర్యవేక్షణలో క్రీడాకారుల సాధన
- 'శాట్స్'కు ప్రతిపాదనలు పంపించాము : డీవైఎస్‌వో శ్రీనివాస్



మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియం



మహబూబ్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకే తలమానికమైన మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియంలో శిక్షకుల కొరత నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో రూ.2.50 లక్షలతో ప్రధాన స్టేడియం ఆధునికీకరణతో పాటు రూ.6.99 కోట్లతో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం చేట్టారు. దాంతో క్రీడాకారులు ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఇండోర్ కల నెరవేరింది. బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, జూడో, టెబుల్ టెన్నిస్, నెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలు నిర్వహించుకోవచ్చు. అయితే స్టేడియం మైదానాన్ని అభివృద్ధి చేసినా మైదానంలో కోచ్‌ల కొరత తీరడం లేదు. 19 ఏళ్లుగా ఈ సమస్య నెలకొంది. దాంతో ఔత్సాహిక క్రీడాకారులు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, క్రీడల రాష్ట్ర సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన వారు కావడంతో కోచ్‌లను నియమించి, క్రీడాభివృద్ధికి పాటుపడాలని ఉమ్మడి జిల్లా క్రీడాకారులు, క్రీడా సంఘాలు, క్రీడాభిమానులు కోరుతున్నారు. క్రీడా సంఘాలు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షణలో శిక్షణ పొంది, పలువురు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదుగుతున్నారు. స్టేడియాల్లో ప్రతీ క్రీడకు కోచ్‌లను నియమిస్తే ఎంతో మంది క్రీడాకారులు తయారయ్యే అవకాశం ఉంది. కోచ్‌ల నియామకం కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్)కు జిల్లా క్రీడాశాఖ అధికారి ప్రతిపాదనలు పంపారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..

జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, స్విమ్మింగ్ క్రీడలకు మాత్రమే కోచ్‌లు ఉన్నారు. ఖేలో ఇండియా సెంటర్‌లో ఫుట్‌బాల్ కోచ్ ఒక్కరే ఉన్నారు. హాకీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, కబడ్డీ, బాక్సింగ్ తదితర క్రీడాలకు కోచ్‌లు లేకపోవటంతో క్రీడాకారులకు సాధన చేయడం ఇబ్బందిగా మారింది. క్రీడా సంఘాల ప్రతినిధులు అనేక మార్లు జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య తీరలేదు. ప్రధాన స్టేడియంలోనే పరిస్థితి ఇలా ఉండగా, ఉమ్మడి జిల్లాలోని మిగతా స్టేడియాల్లో కోచ్‌లే లేరు. కేవలం వేసవిలో మాత్రం నెల రోజుల పాటు వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.

కోచ్‌లను నియమించాలి



స్టేడియంలో మైదానాలు అందుబాటులో ఉన్నా, కోచ్‌ల కొరత ఉంది. కోచ్‌ల నియామకం చేపడితే ఔత్సాహిక క్రీడాకారులకు సరైన శిక్షణ ఇవ్వొచ్చు. కోచ్‌లను నియమించాలని క్రీడా సంఘాలతో కలిసి ప్రజా ప్రతినిధులు, క్రీడా శాఖ అధికారులను మరోసారి కలుస్తాం.

- కురుమూర్తిగౌడ్, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి

ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదు



జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదు. ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. జిల్లా కేంద్రంలో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం, ప్రధాన స్టేడియం అందుబాటులో ఉన్నాయి. కోచ్‌ల నియామకం చేపట్టాలి. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారుడు కాబట్టి కోచ్‌ల నియామకం చేపడితే క్రీడాభివృద్ధి జరుగుతుంది.

- దూమర్ల నిరంజన్, టీజీపెట రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రతిపాదనలు పంపించాం..



జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంతో పాటు ఎంవీఎస్ ఇండోర్ స్టేడియంలో కోచ్‌ల నియామకం కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్)కు ప్రతిపాదనలు పంపించాము. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, స్విమ్మింగ్‌కు, ఖేలో ఇండియా సెంటర్‌లో ఫుట్‌బాల్‌కు కోచ్‌లు ఉన్నారు. మిగతా ఆటలకు త్వరలో కోచ్‌లను నియమించే అవకాశం ఉంది.

-ఎస్. శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

ఎన్నికలకు ఏర్పాట్లు

- స్థానిక సంస్థల ఎలక్షన్స్ నిర్వహణకు సర్వం సిద్ధం
- నిమగ్నమైన అధికార యంత్రాంగం
- నారాయణపేట జిల్లాలో 13 జడ్పీటీసీ, 136 ఎంపీటీసీ, 272 సర్పంచ్ స్థానాలు



నారాయణపేట జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం

నారాయణపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు నారాయణపేట జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తాజాగా అధికారులకు ఆదేశించారు. దాంతో అధికారులు ఆ ఏర్పాట్లలో నియమగ్నమయ్యారు. ప్రభుత్వం ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించిన అనంతరం సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ సారి జిల్లాలో కొత్తగా గుండుమాల్, కొత్తపల్లి మండలాలను ఏర్పాటు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మూడు వేల నుంచి నాలుగు వేల జనాభా ఉన్న గ్రామ పంచాయతీలను కలిపి ఒక ఎంపీటీసీ సభ్యుడి స్థానంగా గుర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో మూడున్నర వేల జనాభాకు ఒక ఎంపీటీసీ స్థానాన్ని ఎంపిక చేసేలా అధికారులు గ్రామాల పరిధిని పరిగణలోకి తీసుకోనున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో శైలేష్ కుమార్, జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీవో సుధాకర్‌రెడ్డి, అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలయ్యారు.

13 జడ్పీటీసీ, 136 ఎంపీటీసీ సభ్యుల స్థానాలు

జిల్లా వ్యాప్తంగా ఇదివరకు 11 మండలాలు ఉండగా కొత్తపల్లి, గుండుమాల్ మండలాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. దాంతో 13 జడ్పీటీసీ సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. మద్దూర్, రెనివట్లను కలిపి మద్దూర్ మునిసిపాలిటీగా ఏర్పాటు చేయడంతో మద్దూర్‌లో రెండు, రెనివట్లలో ఒకటి, హకీంపేట, పోలేపల్లి కలిపి మరొకటి ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. దాంతో జిల్లా వ్యాప్తంగా ఇదివరకు 140 ఎంపీటీసీ స్థానాలు ఉండగా నాలుగు స్థానాలు తగ్గి, 136 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

4,67,217 జనాభా

2011 జనాభా లెక్కల ప్రకారం నారాయణపేట జిల్లాలో 4,67,217 మంది జనాభా ఉన్నారు. అందులో పురుషులు 2,33,758 మంది ఉండగా, స్త్రీలు 2,33,459 మంది ఉన్నారు.

8 గ్రామ పంచాయతీలు తగ్గుదల

జిల్లాలో 280 గ్రామ పంచాయతీలు ఉండేవి. మద్దూర్ మునిసిపాలిటీలో పలు గ్రామ పంచాయతీలు వీలీనం కావడంతో ఎనిమిది పంచాయతీలు తగ్గాయి. ప్రస్తుతం జిల్లాలో 272 పంచాయతీలు ఉన్నాయి.



ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్(ఫైల్)

200 మిలియన్ యూనిట్లకు చేరిన విద్యుత్ ఉత్పత్తి

7

గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్టు...
- 1.3 కేజీల డ్రై గంజాయి, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం

7

మొహర్రం.. భక్తజన సందోహం

- కోయిలకొండలో నేడు బీబీ ఫాతిమా పీరు ఊరేగింపు
- ప్రభుత్వం నుంచి చక్కెర అందించేందుకు ఏర్పాట్లు
- ఊట్కూర్‌లో హసన్, హుస్సేన్ పీర్ల సవారీకి సర్వం సిద్ధం

6



కోయిలకొండలో ప్రత్యేక అలంకరణలో బీబీఫాతీమా పీరు

నారాయణపేట జిల్లాలోని కోయిలకొండ, ఊట్కూర్‌లలో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలకు భక్తులు వేలాదిగా తరలొస్తున్నారు. కోయిలకొండలో ఆదివారం ఆఖరి రోజు సందర్భంగా తెల్లవారుజామున నిర్వహించే బీబీ ఫాతీమా పీరు ఊరేగింపును చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఊట్కూర్‌లో ఆదివారం తెల్లవారు జామున జరిగే హసన్- హుస్సేన్ పీర్ల సవారీని తిలకించేందుకు మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు తెలంగాణలోని జిల్లాల నుంచి భక్తులు తరలొచ్చారు. పొట్టేళ్లు కోసి కందూర్లు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

- కోయిలకొండ/ఊట్కూర్



ఊట్కూర్‌లో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వచ్చే నెల 4 నుంచి ట్రిపుల్ ఐటీ

తరగతులు

- రెడ్డి సేవా సమితి భవనంలో ఏర్పాట్లు
- ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్లు సోమవారం బాసర ట్రిపుల్ ఐటీలో పరిశీలన
- ఉమ్మడి జిల్లాకు చెందిన 65 మందికి అవకాశం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో ట్రిపుల్ ఐటీ 2025-2026 విద్యా సంవత్సరం తరగతులను వచ్చే నెల 4 నుంచి ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గల రెడ్డిసేవా సమితి వసతి గృహంలో తరగతులను నిర్వహించనున్నారు. క్యాంపస్ కోసం మహబూబ్‌నగర్, జడ్చర్ల నియోజకవర్గాల పరిధిలోని దివిటిపల్లి, మల్లెబోయిన్‌పల్లి గ్రామాల్లో 42 ఎకరాల భూమిని కేటాయించిన విషయం తెలిసిందే. వచ్చే వారంలో తరగతులు ప్రారంభించనున్నారు. పదో తరగతిలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు సీట్లు కేటాయించారు. సీట్ల కేటాయింపు కూడా పూర్తయ్యింది. ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్లను సోమవారం బాసర ట్రిపుల్ ఐటీలో పరిశీలించనున్నారు. ఇప్పటికే సీట్లు పొందిన విద్యార్థులకు మెసేజ్‌లు కూడా పంపించారు. సీట్ల ఎంపికను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెరిట్ ఆధారంగా ఎంపిక చేశారు. మొత్తం 250 సీట్లు ఉండగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 65 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిసింది.

డిగ్రీతో ఉన్నత ఉద్యోగాలు

- ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ పూర్తయ్యాక మరో మారు డిగ్రీ ప్రవేశాలకు అవకాశం
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి
- తెలంగాణ బొటానికల్ గార్డెన్‌కు రూ.25వేల విరాళం



మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ ఉంద్యాల బాలకిష్టారెడ్డి


జడ్చర్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం పెంచుకుంటే డిగ్రీ విద్యతో ఉన్నత ఉద్యోగాలు అనేకం ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ ఉంద్యాల బాలకిష్టారెడ్డి అన్నారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ పూర్తయిన అనంతరం మరో మారు డిగ్రీలో చేరేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. దేశంలో అనేక రంగాలలో ఉద్యోగ అవకాశాలు కోకొల్లలుగా ఉన్నాయని చెప్పారు. వికసిత భారత్‌లో భాగంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఉద్యోగ, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ప్రపంచంలోనే భారతదేశం 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందన్నారు. కళాశాలలో మొదటి సంవత్సరంలో ఎంత మంది విద్యార్థులు చేరారనే విషయాన్ని తెలుసుకున్నారు.

గిన్నిస్‌బుక్ రికార్డుకు అవకాశం

జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌కు బాలకిష్టారెడ్డి స్వచ్ఛందంగా రూ.25 వేల విరాళం అందించారు. గార్డెన్‌ను సందర్శించిన ఆయన అందులో చేపట్టిన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పారు. జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కళాశాలలోని బొటానికల్ గార్డెన్ రాష్ట్రంలో మరెక్కడా లేదని, మరింత కష్టపడితే గిన్నిస్‌బుక్‌లో ప్రవేశించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నర్మద, బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టర్ల బడిబాట

- సర్కార్ బడులపై ప్రత్యేక శ్రద్ధ
- గురుకులాలపై స్పెషల్ ఫోకస్
- భోజనం నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- వసతులపై జిల్లా, మండల స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీ
- వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలో తనిఖీలు



నాగర్‌కర్నూల్ జిల్లా సిర్సవాడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గణితం బోధిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్(ఫైల్)

నాగర్‌కర్నూల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సర్కార్ బడులు, హాస్టళ్లు, గురుకుల పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫో కస్ పెట్టింది. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించే దిశగా అన్ని విధాలా కృషి చేయాలని కలెక్టర్లను ఆదేశించడంతో వారంతా ఇప్పుడు బడిబాట పట్టారు. దీని కారణంగా సరైన అజమాయిషీ లేక గాడి తప్పిన సర్కార్ బడులు, హాస్టళ్లు, క్రమంగా సరైన మార్గంలో వస్తున్నాయి. కలెక్టర్ స్థాయి అధికారులు ఏ సమయంలో ఎక్కడ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారోనన్న భయంతో జవాబు దారీతనం పెరిగిన పరిస్థితి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కన్పిస్తోంది. పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటికీ కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో క్రియాశీల కంగా వ్యవహరించడంతో

(మిగతా 6లో..)



భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కాలువకు విడుదలవుతున్న నీరు

నీటి విడుదల

- సంగంబండ, భూత్పూరు రిజర్వాయర్ల నుంచి ప్రారంభించిన అధికారులు

మక్తల్ రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని సంగంబండ, భూత్పూరు రిజర్వాయర్ల నుంచి ఇరిగేషన్ అధికారులు డీఈలు సతీష్‌కుమార్, సురేష్‌కుమార్ శనివారం నీటిని విడుదల చేశారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి భారీ ఎత్తున వరద వస్తున్నందున పంటల సాగు కోసం కుడి, ఎడమ హైలెవెల్, లో లెవెల్ కాలువల ద్వారా, తాగునీటి కోసం నీటిని వదిలారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్య

- మద్యం మత్తులో చనిపోయాడని నమ్మించే ప్రయత్నం
- మెడపై గాయాలు చూసి అనుమానం ఉన్నదని మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు
- గొంతు నులిమి చంపినట్లు పోస్టుమార్టంలో ఆనవాళ్లు
- హైదరాబాద్‌లో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి
- ఫోన్‌లో మాట్లాడొద్దన్నందుకు ఘాతుకం

7

ఇసుక టిప్పర్లు వెనక్కి..

- మాగనూరు పెద్దవాగు నుంచి తీసుకెళ్తుండగా అనుమతులు లేవని రైతుల అడ్డగింపు

7

భక్తిశ్రద్ధలతో శనీశ్వరుడికి పూజలు



నందివడ్డెమాన్‌లోని శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీ జేష్టాదేవి సమేత సార్థసప్త శనీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు తిల తైల అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులు, నల్లని వస్త్రంతో పూజలు ఘనంగా చేశారు. శనీశ్వర స్వామిని ఏడు వారాల పాటు పూజించిన అనంతరం ఆలయ ఆవరణలోని నందీశ్వరుడికి, పరమశివునికి వివిధ రకాల పండ్ల రసాలు, బిల్వ పత్రాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తే స్వామి వారి కృపకు నోచుకుంటారని భక్తుల విశ్వాసం. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి, పూజారులు ఉమామహేశ్వర్, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్రాబాద్‌లో ఈదమ్మ దేవత విగ్రహం లభ్యం

» రోడ్డు విస్తరణ పనులు చేస్తుండగా తవ్వకాలలో

అమ్రాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సమీపాన ప్రధాన రహదారిపై ఈదమ్మ దేవత విగ్రహం లభ్యమైంది. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా ఈదమ్మ దేవత విగ్రహం బయటపడింది. తాత్కాలికంగా ఆ సమీపాన ఏర్పాటు చేసి, గ్రామస్థులు అమ్మవారికి అభిషేకం చేశారు. రోడ్డు విస్తరణ పనులు అయ్యాక అక్కడ దేవాలయ నిర్మాణాన్ని చేపట్టాలని రోడ్డు విస్తరణ అధికారులు, గ్రామస్థులు కోరారు.



అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ముందు మెయిన్ రోడ్డు విస్తరణ చేస్తుండగా బయటపడ్డ ఈదమ్మ దేవత విగ్రహం

రైతుపై విచక్షణారహితంగా ఎస్ఐ దాడి

పొలం పంచాయితీలో డబ్బులు తీసుకొని మరీ అతనిపైనే కేసు

గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన బాధితుడు

గద్వాల క్రైం, జులై 5 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా పోలీసులు మరీ కర్కశంగా తయారయ్యారు. తమకు నచ్చనివారు ఎవరైనా ఉంటే వారిని ఇట్టే కేసులో ఇరికిద్దామనే ఉద్దేశమే వారి లక్ష్యం. ఇందుకు నిదర్శనంగా జిల్లాలోని మల్దకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన ద్వారా తెలుస్తుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మల్దకల్ మండలంలోని పావనంపల్లి గ్రామానికి చెందిన తెలుగు తిమ్మప్పకు సంబంధించిన పొలం పక్కన ఉన్న వారికి కొంత కాలంగా భూ తగాదాలు ఉన్నాయి. అయితే అవతలి వ్యక్తి అక్రమంగా రాళ్లు పాతారు. తిమ్మప్ప వాటిని తొలగించి దున్నుతుండగా అవతలి వ్యక్తులు మల్దకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ పొలం నాదని తిమ్మప్ప ఎస్ఐకి చెప్పడం జరిగింది. అయితే న్యాయం చేస్తానని ఎస్ఐ చెప్పడంతో రూ. 10వేలు ఇచ్చానని, ఈ తరుణంలో తనపై కేసు నమోదు చేసినట్లు బాధితుడు తెలిపారు. అయితే అవతలి వ్యక్తులకు రాజకీయ పలుకుబడి పుష్కలంగా ఉండటంతో శనివారం సాయంత్రం తనపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చారని తెలుగు తిమ్మప్ప వాపోయాడు. రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి తన ఆవేదనను విలేకరుల ముందు వెల్లబోసుకున్నాడు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించాలన్నారు. మల్దకల్ ఎస్ఐ నందికర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. తెలుగు తిమ్మప్పపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వివరాలు తెలుపుతున్న బాధితుడు

లొద్ది మల్లయ్య

దర్శన భాగ్యం లేనట్లే!

» అనుమతులు లేవంటున్న అటవీ శాఖ

» ప్రకృతి రమణీయత తిలకించేందుకు మొగ్గు చూపుతున్న భక్తులు

» నేడు ఏకాదశి ఉత్సవాలు



లొద్ది క్షేత్రంలోని గుండంలో స్నానాలు చేస్తున్న భక్తులు (ఫైల్)

అచ్చంపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్యం కొండ గుహలో కొలువైన లొద్ది మల్లయ్య ప్రతీ ఏడాది తొలి ఏకాదశి రోజున భక్తులకు దర్శనమిస్తాడు. అభయారణ్యంలో ఈ క్షేత్రం ఎత్తైన కొండ దిగువన సముద్ర మట్టానికి 914 మీటర్ల ఎత్తులో ఉంది. ఇక్కడి ప్రకృతి అందాలు భక్తులనే కాకుండా పర్యాటకులను కట్టిపడేస్తాయి. ఏటేటా భక్తుల రద్దీ పెరగడం, ఇదే సమయంలో జంతువుల సంతానోత్పత్తి ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో.. అటవీశాఖ మూడు నెలల పాటు నిషేధం విధిస్తుంది. ఈ క్రమంలో ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బంది కలుగుతుందని అటవీ శాఖ అనుమతులను నిరాకరిస్తుంది. లొద్ది క్షేత్రంలో గుండంలో భక్తులు పుణ్యస్నానాలు చేసి పుణీతులు అవుతారు.

నల్లమలలో ఏకాదశి రోజున దర్శనీయ స్థలాలు

నల్లమల అభయారణ్యంలో తొలి ఏకాదశి రోజు కొలువైన ఆయా దేవతామూర్తులను భక్తులు దర్శించు కొని తరిస్తుంటారు. శ్రీశైలం ప్రధాన రహదారి గుండం బేస్ క్యాంపు సమీపంలో లొద్ది మల్లయ్య క్షేత్రం, మల్లెల తీర్థం, ఉమామహేశ్వర క్షేత్రం, మన్ననూర్ శివాలయం, పదర మండల సమీపంలోని నాగేశ్వరం, వంకేశ్వరం సమీపంలోని భైరవసేన, బీకే లక్ష్మాపూర్ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, మద్ది మడుగు అంజన్నస్వామి ఆలయంతో పాటు కృష్ణ పరివాహక ప్రాంతంలోని పాలెంకుల సమీపంలో వీరభద్రస్వామిని ఏకాదశి రోజున భక్తులు దర్శించుకున్నారు. కాగా ఇందులో ఉమామహేశ్వరం, మద్దిమ డుగు, మన్ననూరు శివాలయం, మినహాయించి, మిగతా క్షేత్రాలకు అటవీశాఖ అంక్షలు విధించింది.



కొలువైన లొద్ది మల్లయ్య

అటవీశాఖ అనుమతించాలి

లొద్ది మల్లయ్య ఈ ప్రాంత భక్తులు కొలుస్తుంటారు. అటవీశాఖ ఆంక్షల పేరు తో భక్తుల మనోభావాలను దెబ్బతీయ కుండా అనుమతి ఇచ్చి సదుపాయాలు కల్పించాలి. ఏళ్లుగా లొద్ది మల్లయ్యను ఏ కాదశి రోజున దర్శించుకోవడం ఆనవా యితీగా వస్తుంది.

\- గట్టు మురళీధర్‌రెడ్డి, పోలిశెట్టిపల్లి

భక్తులకు అనుమతి లేదు

జంతువుల సంతానోత్పత్తి సమయం అయినదుఉన అడవిలోకి ఎవరూ వెళ్ల కూడదు. లొద్ది క్షేత్రంలో ఏకాదశి రోజున పూజారులు మాత్రమే వెళ్లి పూజలు చేసి వచ్చేందుకు అనుమతి ఇస్తున్నాం. భక్తులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఎవరూ కూడా అడవులలోకి వెళ్లరాదు.

\- వీరేశం, అమ్రాబాద్ రేంజర్

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యేలు



మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన నాయకులు

అచ్చంపేటటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ ము ఖ్యమంత్రి కేసీఆర్‌ను అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు కలిశారు. ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన కేసీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి ఆరోగ్యం గురించి ఆయనను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పాటు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన విజితారెడ్డి

కల్వకుర్తి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కల్వకుర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ విజితారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. లండన్ పర్యటన ము గించుకుని తెలంగాణ భవన్‌కు వచ్చిన కేటీఆర్‌ను ఆమె కలిసి సత్కరించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనే తెలంగాణ రాష్ట్రం ప్రపంచంలో నెంబర్‌వన్‌గా నిలిచిందని ఆమె గుర్తు చేశారు.



మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన డాక్టర్ విజితారెడ్డి

మొహర్రం.. భక్తజన సందోహం



బీబీ ఫాతిమా అలం వద్ద పోటెత్తిన భక్తులు



దీపాలు మోస్తూ పీర్ల అలాయ్ చుట్టూ తిరుగుతున్న భక్తులు

» నారాయణపేట జిల్లాలో ఘనంగా మొహర్రం

» కోయిలకొండలో నేడు బీబీ ఫాతిమా పీరు ఊరేగింపు

కోయిలకొండ/ఊట్కూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలోని కోయిలకొండ, ఊట్కూర్‌లలో మొహర్రం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. కోయిలకొండ బీబీ ఫాతీమా పీరు దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలొచ్చారు. పెద్ద గౌని నుంచి బీబీ ఫాతీమా ఆలయం వరకు భక్తులు బారులు తీరారు. ఆదివారం తెల్లవారుజామున అగ్నిగుండం, బీబీ ఫాతీమా పీరు ఊరేగింపు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం తరఫున చక్కెర అందించనున్నారు. కర్ణాటక, మహారాష్ట్రతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కందుర్లు చేసి, మొక్కులు చెల్లించుకొనున్నారు.

కనువిందు చేసిన పీర్ల సవార్లు..

ఇమాం ఖాసీం, ఉషాన్‌పాష, చాన్‌దూల పీర్ల సవార్లు శనివారం కనువిందు చేశాయి. ఈ పీర్లు ఊరేగింపుగా ఖిల్లా గుట్టపైకి వెళ్లి, బీబీ ఫాతీమాను దర్శనం చేసుకొని, గ్రామంలోని విధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఆఖరి రోజు సందర్భంగా కోయిలకొండ పీర్లతో పాటు పారుపల్లి, ఇబ్రహీంనగర్, అంకిళ్ల, అనంతాపూర్ గ్రామాల పీర్లను మండల ఊరేగించి, నిమజ్జనానికి తరలిస్తారు. ఎస్ఐ తిరుపాజీ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. సరిడా బస్సులు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు.

ఊట్కూర్‌లో హసన్, హుస్సేన్ పీర్ల సవారీకి సర్వం సిద్ధం

ఊట్కూర్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే కులమతాలకు అతీతంగా వైభవంగా నిర్వహించే మొహర్రం ఉత్సవాలకు ఊట్కూర్ సిద్ధమైంది. ఆదివారం తెల్లవారు జామున జరుగనున్న హసన్- హుస్సేన్ పీర్ల సవారీకి మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో ఊట్కూర్ భక్తులతో కిటకిటలాడుతోంది. వివిధ వాహనాల్లో కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు పొట్టేళ్ల కోసం కందూర్లు చేశారు. దీపాలను మోస్తూ అలాయ్ చుట్టూ తిరిగి మొక్కులు చెల్లించుకున్నారు. చెరువు కట్ట సమీపంలో ఉన్న రోషన్ అలీ తాతా దర్గలో ఫాతిహాలు ఇచ్చి విభూదిని స్వీకరించారు. సాయంత్రం వివిధ పార్టీల నాయకులు పీర్ల మసీద్‌కు వచ్చి ఫాతిహాలు ఇచ్చారు. మొహర్రం సందర్భంగా తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కృష్ణ, మాగనూర్, నర్వ, మఖ్తల్, నర్వ, నారాయణపేట, ఊట్కూర్ పోలీస్‌లతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొహర్రం ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

» నారాయణపేట డీఎస్పీ లింగయ్య

ఊట్కూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలోనే అత్యంత వైభవంగా జరిగే ఊట్కూర్ హసన్-హుస్సేన్ పీర్ల మోహర్రం ఉత్సవాలకు పటిషటమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు నారాయణపేట డీఎస్పీ లింగయ్య అన్నారు. ఊట్కూర్ మొహర్రం ఉత్సవాల సందర్భంగా శనివారం స్థానిక రైతువేదికలో పోలీస్ భద్రత ఏర్పాట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ బందోబస్తులో ఉన్న పోలీసులు సంయమనం పాటించాలని అన్నారు. ఎవరికి కేటాయించిన స్థలంలో వారు అక్కడే ఉండి పని చేయాలన్నారు. పీర్ల చావడి, మసీదుల వద్ద, ప్రధాన చౌరస్తాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం పీర్ల రూట్ మ్యాప్‌తో పాటు ప్రధాన కూడళ్లు, ఏఏ చోట ఎవరు విధుల్లో ఉండాలో వివరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల దారి మళ్లింపు ప్రాంతాల గురించి సూచనలు చేశారు. సమావేశంలో నారాయణపేట, మక్తల్ సీఐలు, ఊట్కూర్ ఎస్ఐ రమేష్, ఇన్‌చార్జి ఎస్ఐ నవీద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు

గోల్ బాల్ క్రీడల్లో భారత జట్టుకు ఎంపికైన ఆత్మకూరు అంధ విద్యార్థి



గోల్ బాల్ క్రీడ భారత జట్టుకు ఎంపికైన పవన్ కళ్యాణ్, కోచ్‌గా ఎంపికైన గాండ్ల శివకుమార్

ఆత్మకూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : గోల్ బాల్ క్రీడలో భారత జట్టుకు ఆత్మకూరు అంధ విద్యార్థి పవన్ కళ్యాణ్ ఎంపికైనట్లు సమ్మేళిత ఫౌండేషన్ డైరెక్టర్ గాండ్ల శివకుమార్ తెలిపారు. భారత జట్టు గోల్ బాల్ క్రీడ కోచ్‌గా గాండ్ల శివకుమార్ ఎంపికైనట్లు చెప్పారు. 8 సంవత్సరాలుగా ఆత్మకూరు పట్టణ కేంద్రంలో సమ్మేళిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు ఉచిత సేవను అందిస్తూ.. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన పవన్ కళ్యాణ్ సెప్టెంబరు 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఈజిప్టులో జరిగే అంతర్జాతీయ గోల్ బాల్ క్రీడలో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. పవన్ కళ్యాణ్ ఎంపికపై ఆత్మకూరు సీనియర్ క్రీడాకారులు ఆయా పార్టీల నాయకులు అభినందించారు.

రేపు బాలానగర్‌లో.. ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా బాల, బాలికల బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలను సోమవారం బాలానగర్ మండల కేంద్రంలోని ఈఎంఆర్ఎస్-ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మక్బూద్ బిన్ జాకెర్, నస్రూల్లా హైదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 01-01-2007 తరువాత పుట్టిన వారు అర్హులని, క్రీడాకారులు జనన ధ్రువపత్రం, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్‌తో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు గద్వాల ఉత్తనూరులో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించే అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

మక్తల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని మహాత్మ జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన ఐదు మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి తెలిపారు. లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ ద్వారా శిక్షణ పొంది పతకాలు సాధించారని కోచ్ జగదీష్ తెలిపారు.

కొల్లాపూర్‌కు చెందిన బాలుడు..



తూర్పు అగస్త్య ముదిరాజ్

కొల్లాపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల బాలుర విభాగంలో 60 మీటర్ల పరుగు పందెం రాష్ట్రస్థాయి పోటీలకు కొల్లాపూర్ పట్టణవాసి ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తూర్పు కుమార్ ముదిరాజ్ కుమారుడు తూర్పు అగస్త్య ముదిరాజ్ ఎంపికయ్యాడు. అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ విజయేందర్ యాదవ్, డాక్టర్ సోలపోగుల స్వాములు ఆధ్వర్యంలో కల్వకుర్తిలో గత నెల 22వ తేదీన నిర్వహించిన పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో అగస్త్య పాల్గొని పదేళ్లలోపు బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో ప్రతిభ కన బరిచారు.

నేడు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ అథ్లెటిక్స్ ప్ర. దాన స్టేడియంలో నిర్వహించనున్న 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనేందుకు అగస్త్య ఎంపికవడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

కలెక్టర్ల బడిబాట

(5వ పేజీ తరువాయి)

ఆశించిన ఫలితాలు రావడమే కాదు గ్రామాలు, మండలాలు, జిల్లా కేంద్రాల్లో కూడా తమ పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పించే ప్రక్రియను తల్లిదండ్రులు ప్రా రంభించారు.

ఉమ్మడి జిల్లాలో అందరికీ ఆదర్శంగా నిలిచే విధంగా ప్రభుత్వ టీచర్లు కూడా తమ పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పించడంతో క్రమంగా వీటి పట్ల ఆదరణ పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయగలిగితేనే ఆదరణ పెరుగుతుందనే సంకల్పంతో హాస్టళ్లు, గురుకులాల్లో భోజన నాణ్యతను పెంపొందించే దిశగా ఉన్నతాధికారులు వేసిన అడుగులు సత్ఫలితాలను ఇచ్చిన ఉదాహరణలు కన్పిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 42,695మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం గమనార్హం. నాగర్‌కర్నూల్ జిల్లాలో 560 ప్రాథమిక, 125 ప్రాథమికోన్నత, 130 ఉన్నత పాఠశాలల్లో 67,999మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బడిబాట తర్వాత ఆ సంఖ్య 12,600కు పెరిగింది. గద్వాలలో 285 ప్రాథమిక, 81 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 91 ఉండగా మొత్తం 54వేల 575 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బడిబాట కార్యక్రమం నిర్వహించిన తర్వాత దాదాపు 1200మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. నారాయణపేట జిల్లాలో కూడా ప్రభుత్వ పాఠశాలలపై స్పందన క్రమంగా పెరుగుతున్నది. నారాయణపేట జిల్లాలో 334 ప్రాథమిక, 85ప్రాథమికోన్నత, 76ఉన్నత పాఠశాలల్లో 52వేల 762 మంది విద్యనభ్యసిస్తుండగా బడిబాట తర్వాత ఆ సంఖ్య 1177కు చేరింది.



సిర్సవాడ పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్(ఫైల్)

హడలెత్తిస్తున్న కలెక్టర్లు

గత వారం రోజుల నుంచి ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలపై స్పెషల్ ఫోకస్ పెట్టిన కలెక్టర్లు అధికారులను హడలెత్తిస్తున్నారు. నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రతీ రోజు ప్రభుత్వ పాఠశాల, గురుకుల లేదా మైనార్టీ హాస్టళ్లను తనిఖీ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల అవగాహన పద్ధతిని తానే స్వయంగా పరిశీలిస్తూ తనకున్న పరిజ్ఞానం మేరకు విద్యార్థులకు క్లాసులను బోధిస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ డీఎం సంతోష్ వారం రోజుల్లో బీచుపల్లి మండలం ఎర్రవల్లి గురుకుల పాఠశాల, గద్వాల మండలం వీరాపురం గురుకుల పాఠశాలను పరిశీలించి అక్కడున్న అపరిశుభ్రత వాతావరణంపై అసహనం వ్యక్తం చేశారు. మళ్లీ మూడు రోజుల్లో అక్కడికి వస్తానని అపరిశుభ్రత పరిస్థితి చక్కబడకపోతే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నారాయణపేట జిల్లాలో కలెక్టర్ సిక్తాపట్నాయక్ గురుకుల, ప్రభుత్వ పాఠశాల, ధన్వాడలో మోడల్ స్కూల్‌ను పరిశీలించి మారకుంటే మార్పులు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

టీచర్ల ఖాళీలను భర్తీ చేస్తే మరింత ప్రయోజనం

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వానికి దృఢ సంకల్పం ఉన్నప్పటికీ మౌలిక సదుపాయాల కల్పన టీచర్లను భర్తీ చేయకుండా తాత్సారం చేయకుండా వేగంగా అమలు చేస్తే సర్కార్ విద్య పట్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా మొగ్గు చూపుతారని విద్యాభిమానులు పేర్కొంటున్నారు.

నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించం

విద్యతోనే జీవితాలు మెరుగుపడుతాయి. అందుకు దోహదం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నది. ఇందుకు ప్రభుత్వ ఉద్యోగుల సంపూర్ణ సహకారం కూడా కావాలి. గురుకులాలు, హాస్టళ్లల్లో విద్యార్థుల పొట్ట కొట్టే ఎలాంటి చర్యలను ఉపేక్షించేది లేదు. ఇక నుంచి వారంలో రెండు రోజులు జిల్లా స్థాయి అధికారులు, నాలుగు రోజులు మండలంలోని అన్ని శాఖలకు చెందిన ఆఫీసర్లు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేస్తారు. ఏమాత్రం లోటుపాట్లు జరిగినా శాఖపరంగా పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.

\- బదావత్ సంతోష్, కలెక్టర్, నాగర్‌కర్నూల్

ఉమ్మడి జిల్లాలో ఖాళీలే అధికం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు అధికంగా ఉండటం గమనార్హం. నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 3071ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా, 2753మంది పని చేస్తున్నారు.

మొత్తం 318 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. కరోనా తర్వాత పల్లె వెలుగు బస్సులు గ్రామీణ ప్రాంతాలకు 90శాతం వరకు రద్దు చేయడంతో వారు సకాలంలో పాఠశాలలకు చేరుకోలేక పోతున్నారు.

క్రైం కార్నర్

ఫోన్ చేసుకుంటానని చెప్పి.. డబ్బులు కాజేసిన సైబర్ నేరగాడు

» పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

భూత్పూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దగ్గర గుర్తు తెలియని మరో వ్యక్తి ఫోన్ చేసుకుంటాను అని ఫోన్ తీసుకొని డబ్బులు కాజేసిన సంఘటన శనివారం భూత్పూర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని తుకుంజాల్ ఏరియాకు చెందిన వెంకట్‌నాయుడు హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు బస్సులో వెళ్తున్నాడు. తన పక్కనే కూర్చున్న గుర్తు తెలియని వ్యక్తి భూత్పూర్ సమీపంలోకి రాగానే ఫోన్ చేసుకొని ఇస్తానని వెంకట్‌నాయుడు వద్ద ఫోన్ తీసుకొని ఖాతాలో ఉన్న రూ.50 వేలు కాజేశాడు. తేరుకున్న వెంకట్‌నాయుడు తన ఫోన్‌లో డబ్బులు చెక్ చేసుకొని కొడుకు ధనుంజయ్‌కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా, 1930కి కాల్ జేసి సైబర్ క్రైంకు వివరించాడు. డబ్బులు పోగొట్టుకున్న బాధితుడు భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మరికల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఆటో ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మరికల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పార్తీవ(38) శుక్రవారం జాతీయ రహదారిపై తీలేర్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పార్తీవను స్థానికులు 108లో మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున పార్తీవ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గౌరారంలో రైతు..

తిమ్మాజిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బుద్దసముద్రం గ్రామానికి చెందిన కావలి రామాంజనేయులు (40) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. స్థానిక ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిసిన వివరాల ప్రకారం.. బ్యాంకు అప్పులతో పాటు ప్రైవేట్ అప్పులు చేసి పంట సాగు చేశాడని, పంట దిగుబడి రాక అప్పులు తీరక మనస్తాపం చెందుతూ ఉన్న అతను గత నెల 21న రాత్రి పురుగుల మందు తాగి వాంతులు చేయడాన్ని గమనించిన భార్య మంజుల బావ అయిన కావలి సాయిబాబకు ఫోన్ చేయగా అతను వెంటనే వచ్చి జడ్చర్ల, అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని, కావలి సాయిబాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. బ్యాంకులో రూ. లక్షా 60వేలు, ప్రైవేట్ అప్పులు రూ. 3లక్షల 50వేల అప్పులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బైక్‌పై నుంచి కిందపడి..

తెలకపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ బి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల మండలం బాకారం గ్రామానికి చెందిన దోరెడ్డి సాలయ్య (46) అనే వ్యక్తి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం గ్రామానికి వలస వెళ్లి కూలి పని చేసుకుని కుటుంబంతో నివసిస్తున్నాడు. జూన్ 30న పీర్ల పండగ కోసం తెలకపల్లి మండలం బొప్పల్లికి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులతో తెలిపి ఈ నెల 1న తన ద్విచక్ర వాహనంపై కల్వకుర్తి నుంచి తెలకపల్లి వైపు వస్తున్నాడు. గౌరారం గ్రామ శివారులో కాటన్ గోదాం దగ్గరలో అతివేగంగా, తన బైకుని నడిపి ప్రమాదవశాత్తు తనంతట తాను కిందపడి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన గౌరారం గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి 108 అంబులెన్స్ వాహనంలో చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 3న మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కూతురు దోరెడ్డి చంద్రకళ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి పట్టివేత : ఇద్దరి అరెస్టు

జడ్చర్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీలోని లక్ష్మీనిలయంలో దాడులు నిర్వహించి గంజాయి పట్టుకున్నట్లు జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్) హైదరాబాద్ టీం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కౌశిక్, శ్రీకర్ వద్ద ఉన్న 1.3 కేజీల డ్రై గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. పట్టణంలోని కళాశాల విద్యార్థులకు, యువతకు ప్యాకెట్ల రూపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. గంజాయి విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాముకాటుతో ఎద్దు మృతి

మానవపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన మాల మునిస్వామి రైతుకు చెందిన ఎద్దును శుక్రవారం రాత్రి పాము కాటు వేసింది. ఒక రోజంత ఎద్దు అనారోగ్యంతో ఉందని, చివరి దశలో ఎద్దు నోట్లో నుంచి నురగ రావడంతో పాము కాటువేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. కాడెద్దులే జీవనాధారంగా మునిస్వామి కుటుంబం బతుకుతుందని, మృతి చెందిన ఎద్దు రూ.80 వేలు విలువచేసేదని గ్రామస్థులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక..

నారాయణపేట న్యూటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పట్టణంలో విద్యుదాఘాతంతో ఓ మేక మృతి చెందింది. బాధితుడు గొల్ల మల్లప్ప శనివారం పట్టణంలోని బాహార్‌పేట వీధిలో మేకల మందను మేపు కోసం తీసుకెళ్తుండగా ఓ మేక ట్రాన్స్‌ఫార్మర్ పైకి వెళ్లి మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో మేక అక్కడికక్కడే మృతి చెందింది. భారతీయ కిసాన్ సంఘ్ నగర కార్యదర్శి అంజిలయ్యయాదవ్ ఘటనా స్థలాన్ని చూసి వెంటనే విద్యుత్ శాఖ వారికి సమాచారం అందించాడు. బాధితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

భర్తను హత్య చేసిన భార్య

మద్యం మత్తులో చనిపోయాడని నమ్మించే యత్నం

» మెడపై గాయాలు చూసి అనుమానం ఉన్నదని పోలీసులకు మృతుడి సోదరుడి ఫిర్యాదు
» గొంతు నులిమి చంపినట్లు పోస్టుమార్టంలో ఆనవాళ్లు
» హైదరాబాద్‌లో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి
» ఫోన్‌లో మాట్లాడొద్దన్నందుకు ఘాతుకం


భర్తను హత్య చేసిన రాధ

నిజాంపేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం రాంకిష్టయ్యపల్లికి చెందిన అంజిలప్పను భార్య రాధ హైదరాబాద్‌లో హత్య చేసింది. మద్యం మత్తులో మరణించాడని అందరినీ నమ్మించింది. మృతదేహాన్ని తీసుకుని స్వగ్రామానికి రావడంతో అంజిలప్ప సోదరుడికి మృతదేహంపై ఉన్న గాయాలు చూసి అనుమానం వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాంకిష్టయ్యపల్లికి చెందిన అంజిలప్ప, రాధ భార్యాభర్తలు. 2014లో వీరికి వివాహం జరిగింది. ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి, కొద్ది రోజులు మణికొండ ప్రాంతంలో ఉన్నా రు. కూలీ పనులు చేసుకుని జీవించే వారు. తరువాత ముంబైతో పాటు.. పలు ప్రాంతాలకు వలస వెళ్లారు. వారి పిల్లలు మాత్రం రాధ తల్లి స్వగ్రామంలో ఉంటున్నారు. 2025 ఏప్రిల్‌లో ముంబై నుంచి తిరిగి వచ్చి, హైదరాబాద్ నగర శివారులోని బాచుపల్లిలో గల ఓ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలీలుగా చేరారు. అక్కడే నివసిస్తూ, కాంట్రాక్టర్ వెంకటయ్య చేపట్టిన నిర్మాణ స్థలంలో పని చేస్తున్నాడు. కూలీ పనుల నిమిత్తం పలు ప్రాంతాలకు వలస వెళ్లిన వచ్చిన క్రమంలో రాధకు ఇతర వ్యక్తులతో పరిచయాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో రాధ తరచుగా ఫోన్‌లో మాట్లాడుతుండేది. దాంతో భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న అంజిలప్ప రోజూ మద్యం తాగొచ్చి ఇతరులతో ఫోన్ ఎందుకు మాట్లాడుతున్నావని కొట్టేవాడు.

గొంతునులిమి హత్య..

గత నెల 22న దంపతుల మధ్య ఇదే విషయమై గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న అంజిలప్ప భార్యను దుర్భాషలాడుతూ దాడి చేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కాంట్రాక్టర్ జోక్యం చేసుకొని ఇద్దరినీ హెచ్చరించి, నచ్చజెప్పాడు. రోజు రోజుకు భర్త వేధింపులు ఎక్కువ కావడంతో రాధ అదే రోజు రాత్రి 11:30 గంటలకు మద్యం మత్తులో ఉన్న భర్త గుండెలపై కూర్చొని, చేతులతో గొంతు నులిమి హత్య చేసింది. నేరం తన మీదకు రాకుండా ఉండేందుకు అతిగా మద్యం తాగడంతో ఆ మత్తులోనే మరణించాడని మరుసటి రోజు తోటి కార్మికులను నమ్మించింది. అదే విషయాన్ని బంధువులకు చెప్పింది. జూన్ 23న దహన సంస్కారాల కోసం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లింది. అంజిలప్ప మెడపై ఉ న్న గాయాలను గుర్తించిన సోదరుడు మృతిపై అనుమానం ఉందని నారాయణపేట పోలీసుల కు ఫిర్యాదు చేశాడు.

దర్యాప్తు చేసిన బాచుపల్లి పోలీసులు..

కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించారు. అంజిలప్ప మద్యం మత్తులో చనిపోలేదని, హత్య చేశారని తేలడంతో నారాయణపేట పోలీసులు కేసును సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. విచారణ చేపట్టిన బాచుపల్లి పోలీసులు ఈ నెల 1న భార్య రాధను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆమె భర్తను తానే గొంతునులిమి హత్య చేసినట్లు నేరాన్ని అంగీకరించింది. రోజూ మద్యం తాగి వచ్చి వేధించినందునే హత్య చేసినట్లు తెలిపింది. లోతుగా దర్యాప్తు చేసిన బాచుపల్లి పోలీసులు సీసీటీవీ కెమెరాలు, ఇతర టెక్నికల్ ఎవిడెన్స్‌లను సేకరించి రాధ ఒక్కతే భర్తను హత్య చేసిందని నిర్ధారించారు. నిందితురాలిని శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

పరిశ్రమలతో వ్యవసాయ రంగానికి ప్రమాదం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి

రాంనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు జిల్లాకు వ స్తున్న పరిశ్రమలతో వ్యవసాయ రంగానికి ప్రమాదం పొంచి ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో వ్యవ సాయ రంగాన్ని విచ్ఛిన్నం చేసే పరిశ్రమలకు అనుమతులిస్తూ కార్పొరేట్ కంపెనీల జేబులు నింపుతున్నారని ఆరోపించారు. అ నారోగ్యాన్ని తీసకొస్తున్న పాలకుల తీరుకు వ్యతిరేకంగా కలిసి వచ్చే ప్రజా సంఘాలతో ప్రజా ఉద్యమం చేపట్టాల్సిన అవస రం ఉందని పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల జీవనంపై జరిగిన స దస్సులో పలువురు ప్రముఖులు హెచ్‌సీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కో దండరాం, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, పర్యావరణ వేత్త చంద్రశేఖరశర్మ తదితరులు మాట్లాడారు. వ్యవసాయ ఆ ధారిత రంగాలకు నీటి వనరుల పంపిణీ సరగ్గా లేక అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.

విద్యారంగాన్ని అభివృద్ధి చేయకుండా ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగే పరిశ్రమలకు అనుమతులు ఇస్తూ అభివృద్ధి అని చెప్పుకోవడం శోచనీయమన్నారు. పాలమూరులో కల్తీ కల్లు రాజ్యం మేలుతుందని ఆరోపించారు. పాలమూరు నీటి వనరులు అక్క డి ప్రజలకు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం సరికా దన్నారు. ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు అనుమతులు నిరాకరిం చాలన్నారు. పాలమూరుకు వచ్చే పరిశ్రమలన్నీ వ్యవసాయా న్ని నాశనం కోరే పరిశ్రమలేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మె ల్సీ ఎం.కోదండరాం మాట్లాడుతూ పాలమూరు జిల్లా అభివృద్ధికి ఈ సదస్సులో చర్చించిన అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. శాస్త్రవేత్త బా బురావు, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, రాజేం ద్రబాబు, చంద్రశేఖర్, తిమ్మప్ప, రెహ్మాన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెంట్లవెల్లి, జూలై 5, (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థి పాఠశాల దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కొల్లాపూర్ సివిల్ జడ్జి దము ఉపనిషద్వని అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు తప్పనసరిగా యోగా చేయాలని వారికి సూచించారు. అదే విధంగా ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, న్యాయవాదులు ఎండి మోబిన్, బాలస్వామి, రేణుక, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

» కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి


కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సన్నద్ధమైన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కొల్లాపూర్ నియోజవర్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, రైతు భరోసా సమస్యలపై మాజీ ఎమ్మెల్యే రైతులు, నాయకులతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. బీరం మీడియాతోనూ మాట్లాడారు. కొల్లాపూర్ నియోజవర్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మెటీరియల్ విషయంలో ఇబ్బందులు తలెత్తలేదన్నారు. అదేవిధంగా కొల్లాపూర్ నియోజవర్గంలోని చాలా మంది రైతులకు రైతుభరోసా రాలేదని, వారికి శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రజలకు, రైతాంగానికి అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మెటీరియల్ రెండు, మూడు రోజుల్లో ఇవ్వపోతే పెద్ద ఎత్తున సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ బీఆర్ఎస్ నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, రాజుగౌడ్, కాటం జంబులయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సుంకేసుల డ్యాంకు పోటెత్తిన వరద

» ఎగువ నుంచి 74 వేల క్యూసెక్కుల వరద
» 19 గేట్లు ఎత్తి దిగువకు 72 వేల క్యూసెక్కులు విడుదల


సుంకేసుల జలాశయం నుంచి దిగువకు వదిలిన వరద నీరు

రాజోలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులోని సుంకేసుల జలాశయానికి శనివారం వరద నీరు పోటెత్తింది. కర్ణాటక రాష్ట్రంలోని టీబీ డ్యాం (తుంగభద్ర డ్యాం) నుంచి 21 గేట్లు ఎత్తారు. విడుదల చేసిన వరద నీరు శనివారం సాయంత్రం సుంకేసుల డ్యాంకు చేరుకుంది. అధిక మొత్తంలో వరద వస్తుందన్న సమాచారంతో డ్యాం నుంచి ఉదయం 12 గేట్ల ద్వారా 50వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రానికి 74 వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో జలాశయంలో 19 గేట్లు తెరిచి దిగువకు 72 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం జేఈ స్వామి తెలిపారు. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని, మత్స్యకారులు నదిలోకి దిగకూడదని హెచ్చరికలు జారీ చేశారు.

కొత్తగా ఆరు ప్రాథమిక పాఠశాలలు మంజూరు

» గద్వాలలో ఒకటి, అయిజలో ఐదు
» ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యా డైరెక్టర్


పాఠశాల ఏర్పాటు కోసం ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్‌కు వినతి పత్రం ఇస్తున్న పిలిగుంట్ల కాలనీవాసులు (ఫైల్)

గద్వాల సర్కిల్/అయిజ టౌన్, జులై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాభివృద్ధికి మరో అడుగు ముందుకు పడింది. ప్రభుత్వం జిల్లాకు ఆరు ప్రాథమిక పాఠశాలలు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్ డాక్టర్ ఈ.నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా జిల్లా విద్యాశాఖ యంత్రాంగ నివేదిక పరిశీలన అనంతరం కొత్త పాఠశాలల మంజూరు చేసిన జాబితాలో జిల్లాకు ప్రాథమిక పాఠశాలలు వచ్చాయి. అందులో గద్వాల పుర పరిధి 7వ వార్డు పిలిగుంట్లకు ఒకటి, అయిజ పుర పరిధిలో 5 (1వవార్డు-తెలుగుపేట), 7వ వార్డు-తెలంగాణ ఎక్స్ రోడ్, బుడగజంగాల కాలనీ, 16వ వార్డు-ఎస్సీ కాలనీ(న్యూ బిల్డింగ్స్), 17వ వార్డు-టీచర్స్ కాలనీలకు మంజూరయ్యాయి. పాఠశాలల నిర్వహణకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. ఈ విషయమై ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. జిల్లాకు కొత్తగా మంజూరైన ప్రాథమిక పాఠశాలల నిర్వహణకై ప్రభుత్వ భవనాలు లేదా అద్దె భవనాలలో కొనసాగించేందుకు పరిశీలన చేస్తున్నామన్నారు. సాధ్యమైనంత వరకు నూతన పాఠశాలలో విద్యను కొనసాగించేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా తమ పిల్లలకు సుదూర ప్రాంతంలో ఉన్న పాఠశాలలకు వెళ్లేందుకు కష్టమవుతుందని, తమ కాలనీలోనే పాఠశాల ఏర్పాటు చేయాల్సిందిగా పలుమార్లు పిలిగుంట్ల కాలనీవాసులు కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ ఆదేశానుసారం డీఈవో, ఎంఈవో విచారణ జరిపి పాఠశాల ఏర్పాటుపై చర్చించారు. ఈ మేరకు విద్యార్థుల సంఖ్య, అక్కడి పరిస్థితులు తదితర అంశాలతో కూడిన తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ఈ మేరకు కొత్త ప్రాథమిక పాఠశాలల మంజూరులో భాగంగా పిలిగుంట్లకు పాఠశాల మంజూరైంది.

200 మిలియన్ యూనిట్లకు చేరిన విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి) : ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 200 మిలియన్ యూనిట్లకు విద్యుత్ ఉత్పత్తి చేరిందని ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ జూరాల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా 3.353 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టగా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 89.670 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి రాబట్టినట్లు తెలిపారు.

అలాగే దిగువ జూరాల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా 3.915 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు తెలిపా రు. అలాగే ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 108.224 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేపట్టినట్లు తెలిపారు. ఎగువ నుంచి వరద ఆశించిన మేర వస్తున్న కారణంగా ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 10 యూనిట్లను ప్రారంభించి ఉత్పత్తిని చేపడుతున్నట్లు తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరలోనే చేరుకునే అవకాశం ఉందని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించిన కలెక్టర్, డీఈవో

ఉప్పునుంతల, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన చేసిన ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్‌ను కలెక్టర్ బదావత్ సంతోష్, డీఈవో రమేష్‌కుమార్ అభినందించారు. వెంకటేష్ మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో బెస్ట్ టీచింగ్ ప్రాక్టీసెస్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. దీంతో శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విద్యాశాఖ సమీక్ష సమావేశంలో వెంకటేష్‌ను కలెక్టర్, డీఈవోలు అభినందించారు.

ఇనాం భూమి రిజిస్ట్రేషన్ అడ్డుకున్న గ్రామస్థులు


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఇందువాసి గ్రామస్థులు

గట్టు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని ఇందువాసి గ్రామంలో ఇంజమ్మవ్వ దేవతకు చెందిన ఇనాం భూమి రిజిస్ట్రేషన్ నిలపాలంటూ గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేశారు. గ్రామంలోని ఇంజమ్మవ్వ ఆలయానికి సర్వేనంబర్ 775లో 16.03 ఎకరాల పొలం ఉందని తెలిపారు. ఈ భూమి ఆలయ పూజారి ఇంజమ్మ పేరుపై ఉండేదని ఇటీవల ఆమె పేరు నుంచి వారి కుటుంబసభ్యులు బదాలాయించుకున్నారని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే పూజారుల వంశపార్యంపరంగా అనుభవించడానికి మాత్రమే హక్కులు ఉంటాయని గ్రామస్థులు అధికారులకు తెలిపారు. కానీ వారు గుట్టుచప్పుడు కాకండా గ్రామానికి చెందిన ఇతరులకు విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దేవాలయ భూమిని ఎలా విక్రయిస్తారని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసి శనివారం తహసీల్దార్ కార్యాలయానికి రావడంతో సమాచారం తెలుసుకుని గ్రామస్థులంతా వచ్చి నయాబ్ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజే శారు. ఈభూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రస్తుతం నిలుపుదల చే స్తున్నట్లు నయాబ్ తహసీల్దార్ తెలిపారు. గ్రామస్థులు ఇనాం భూమి విషయం పై ఆదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు.

ఇసుక టిప్పర్లు వెనక్కి..

» తిప్పి పంపిన మాగనూరు రైతులు, వివిధ పార్టీల నాయకులు


మాగనూరులో ఇసుక టిప్పర్లు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా కూర్చున్న రైతులు, నాయకులు

మాగనూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మాగనూరులో ఇసుక టిప్పర్లను స్థానిక రైతులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు అడ్డగించి వెనక్కి పంపించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ యజమానులు మాగనూరు 167వ జాతీయ రహదారి పక్కల గల పెద్దవాగు నుంచి శనివారం సాయంత్రం టిప్పర్ల ద్వారా ఇసుకను తీసుకువెళ్లే ప్రయత్నం చేయగా స్థానిక రైతులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు వాహనాలను అడ్డగించి, రోడ్డుపై బైఠాయించారు. అనంతరం వాగులో ఇసుక లోడుతో ఉన్న ఇసుక టిప్పర్‌ను అన్‌లోడ్ చేయించారు. ఎస్ఐ అశోక్‌బాబు, పోలీసులు ఇసుక టిప్పర్లను వదలాలని రైతులతో పాటు, వివిధ పార్టీలకు చెందిన నాయకులతో వాగ్వాదం చేశారు. అందుకు రైతులు, నాయకులు మాగనూరు వాగు నుంచి ఇసుక తరలించేందుకు అనుమతులు ఉన్నాయా అని పోలీసులను ప్రశ్నించారు. ఆర్డీవో వాగు వద్దకు వచ్చి అనుమతులు ఉన్నాయని చెప్పారు కదా అని పోలీసులు తెలుపగా అందుకు అనుపతి పత్రాలు చూపించాలని, ఇక్కడి నుంచి ఇసుక తరలివెళ్తే తాగునీరు, సాగునీటికి చాలా ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. ఈ ప్రాంతం కాక వేరు ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తే మాకు అభ్యంతరం లేదని వారు పోలీసులకు సూచించారు. ఎస్ఐ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని సూచించగా, తాము రామని, అధికారే ఇక్కడికి రమ్మనండని వారు కోరారు. ఈ ప్రాంతం నుంచి ఇసుక తీసుకువెళ్లేది లేదని, ఎంతటికైనా, ఎన్ని కేసులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తే జరిగే పరిణామాలకు మీరే బాధ్యులని అధికారులను హెచ్చరించారు. స్థానిక రైతులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పుంజనూరు ఆంజనేయులు, గడ్డం నరేష్, బాల్‌దాస్, వేణుగోపాల్ తదితరులున్నారు.

న్యూస్ బాక్స్

నేడు తొలి ఏకాదశి

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నారాయణపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశి(ఆషాఢ శుద్ధ ఏకాదశి)ని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధల మధ్య జరుపుకోనున్నారు. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి ఆలయాలను సందర్శించి ఏకాదశి వ్రతాన్ని జరుపుకోనున్నారు. పేట జిల్లాలోని యానగుంది మాణిక్యగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం, మక్తల్ పడమటి ఆంజనేయ స్వామి ఆలయం, గుడెబల్లూర్ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప దేవాలయం, కొల్లంపల్లి వేంకటేశ్వర ఆలయంతో పాటు, నారాయణపేట పట్టణంలోని బాలాజీమందిర్, భవానీమందిర్, పాండురంగ దేవాలయం, కృష్ణదత్‌మందిర్, సాయిబాబా దేవాలయం, రాఘవేంద్రస్వామి ఆలయం, తిరుమలగుట్ట వేంకటేశ్వరస్వామి దేవాలయం, అవధూత నర్సింహాస్వామి మఠం, వ్యాసాశ్రమం, శక్తిపీఠం తదితర దేవాలయాల్లో ఆదివారం ఏకాదశి ప్రత్యేక పూజలు జరుగనున్నాయి.

పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులు దరి చేరవు

దామరగిద్ద, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులు దరి చేరవని దామరగిద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి స్వాతి, హెల్త్ సూపర్‌వైజర్ కిష్టమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

నారాయణపేటరూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో శనివారం కోటకొండ పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. డాక్టర్ విరోజా గ్రామస్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు.

సమ్మెను విజయవంతం చేయాలి

నారాయణపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఉడుమలగిద్ద గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయా సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని మండల కేంద్రాల్లో కార్మికులు, కర్షకులు ఐక్యంగా నిరసన ర్యాలీలు, సభల్లో పాల్గొనాలని వారు కోరారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నారాయణపేట న్యూటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, అలాగే ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ ఆంజనేయులు పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం నారాయణపేట పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టి, రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు పలు సూచనలు చేశారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల చూపే మోసపూరిత ఆశలకు వెంపర్లాడవద్దన్నారు. యువకులు డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. పోలీసులు సంతోష్, సురేష్, సుధాకర్ తదితరులున్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కృష్ణ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అలంపల్లి గ్రామ అంతర్గత రోడ్ల పక్కన ఉన్న స్థలాలను ఆక్రమించిన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. చెరువు కట్ట పక్కన ఉన్న మారెమ్మ గుడి నుంచి గ్రామంలోకి వెళ్లే అంతర్గత రోడ్ల పక్కన ఉన్న స్థలాలు కబ్జా చేయడం వల్ల పొలాలకు, పాఠశాలలకు, దేవాలయానికి రాకపోకలు కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు గౌరప్ప, మారెప్ప, నీలకంఠరాయ, సకీరప్ప తదితరులున్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



సౌమ్య, అభినవ్ / సాహితి

నారాయణపేటరూరల్/నర్వ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేట మండలంలోని కోటకొండ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ చిట్టెం సాహితి శుక్రవారం విడుదలైన ఆర్‌జీయూకేటీ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. అదేవిధంగా, నర్వ మండలం పాతర్‌చేడ్ గ్రామానికి చెందిన సౌమ్య, అభినవ్‌కు ట్రిపుల్ ఐటీలో సీటు రావడంపై ప్రతిభ పాఠశాల కరస్పాండెంట్ హనుమంత్ రెడ్డి, గ్రామస్థులు అభినందించారు.

ఆక్రమణలపై చర్యలేవీ.?

- కుంచించుకుపోతున్న మటన్ మార్కెట్
- అధికారులకు ఫిర్యాదు చేసినా చేపట్టని చర్యలు
- బజారున పడ్డ వ్యాపారులు



గుండుమాల్‌లో మటన్ మార్కెట్ ముందు అక్రమంగా వెలసిన డబ్బాలు

కోస్గి రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గుండుమాల్ మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా నడుస్తున్న మటన్ మార్కెట్ ఆవరణ ఆక్రమణలకు గురవుతోందని గ్రామ ఆరె కటిక కులస్తులు ఆరోపిస్తున్నారు. మార్కెట్ శిథిలావస్థకు చేరుకోవడంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శిథిలమైన వాటిని కూల్చివేయాలని నిర్ణయించడంతో తాము మార్కెట్ లోపల కాకుండా, ముందుభాగంలో వ్యాపారం కొనసాగిస్తున్నామన్నారు. కొందరు మార్కెట్ ఆవరణలో డబ్బాలు వేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మార్కెట్ ఆవరణ ఆక్రమణకు గురికావడంతో పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్, మండల ప్రత్యేకాధికారికి పలుమార్లు ఫిర్యాదు చేస్తున్నా అధికారుల నుంచి స్పందన కరువైందని ఆరె కటికె కులస్తులు వాపోయారు. పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్పా శాశ్వత చర్యలు తీసుకోకపోవడంపై వ్యాపారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నామని, తమ విన్నపాలు ఏ ఒక్కరూ పట్టించుకోవట్లేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులిచ్చాం..

మటన్ మార్కెట్ ఆక్రమణదారులకు పంచాయతీ కార్యాలయం నుంచి నోటీసులు ఇదివరకే ఇచ్చాం. వారు డబ్బాలు తొలగించక పోతే మేము ఏమీ చేయలేం. సమస్యను కొత్తగా ఉత్పన్నం చేయకండీ అంటూ దురుసుగా సమాధానం ఇచ్చారు.

- సాయిప్రకాష్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గుండుమాల్

కుంటలో భవన నిర్మాణ అనుమతులు రద్దు చేస్తాం

● పాతిపురికుంటలో ఇరిగేషన్, మునిసిపల్ అధికారుల సంయుక్త తనిఖీ



పాతిపురికుంటలో భవన నిర్మాణాన్ని నిలిపివేస్తున్న అధికారులు

కోస్గి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కోస్గి మునిసిపల్ పరిధిలోని పాతపురికుంటలో ఇచ్చిన భవన నిర్మాణ అనుమతులు రద్దు చేస్తామని మునిసిపల్ అధికారులు తెలిపారు. శనివారం మునిసిపల్, ఇరిగేషన్ అధికారులు పట్టణంలో పలుచోట్ల సంయుక్త తనిఖీ నిర్వహించారు. పాతపురి కుంటలో కల్వర్టు మూసి భవన నిర్మాణం చేపడుతున్నారన్న ఫిర్యాదుతో అధికారులు తనిఖీ చేశారు. మునిసిపల్ అనుమతితో కట్టుకుంటున్నానని యజమాని చెప్పడంతో కుంటలో ఎలా అనుమతిస్తారని, ప్రభుత్వ రికార్డులో ఉన్న కుంట ఇదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. నోటీసులు ఇచ్చి అనుమతి రద్దు చేస్తామని మునిసిపల్ అధికారులు పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులు నిలిపివేయాలని అధికారులు సూచించారు. హైవే పక్కన కుంట ఉందని, కుంటను మూసివేస్తే భారీ వర్షం వస్తే హైవే రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు. ఇకనుంచి ఇరిగేషన్ అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ ఆనంద్‌కిశోర్, ఏఈలు పవన్‌రెడ్డి, నిర్మల, మునిసిపల్ అధికారులు వెంకటయ్య, బలరాం తదితరులున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మాగనూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, డ్రైవర్లకు ప్రభుత్వం సంవత్సరానికి ఇస్తామన్న రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని అందజేయాలని డిమాండ్ చేస్తు శనివారం సీఐటీయూ, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు ర్యాలీగా వచ్చి తహసీల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. పెరుగుతున్న డీజిల్, ఇతరత్రా ధరల వల్ల ఆటోల ద్వారా వచ్చే సంపాదన కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు దండు బసవరాజ్, నామలి తిమ్మప్ప, బాబయ్య, శ్రీకాంత్, రాజేందర్‌గౌడ్, మేకల వెంకటేష్ ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి



ఎంపీవో రహమత్‌పాషకు వినతిపత్రం అందిస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు

మక్తల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులకు అనుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ నివారణకు చర్యలు తీసుకోవాలని పీవోడబ్ల్యూ శారద ఆధ్వర్యంలో నాయకులు శనివారం ఎంపీవో రహమత్‌పాషకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలని, ఫాగింగ్, నీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. పీహెచ్‌సీ కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచాలన్నారు. మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్, చికున్‌గున్యా వంటి వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకులు మహాదేవి, విజయలక్ష్మి, పీవైఎల్ నాయకుడు మల్లేష్ ఉన్నారు.

కొనసాగుతున్న మొహర్రం ఉత్సవాలు



మక్తల్ మండలం కర్నిలో పీర్ల ఊరేగింపు

మక్తల్‌రూరల్/ధన్వాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని కర్ని, మంథన్‌గోడ్, గొల్లపల్లి, అనుగొండ, పసుపుల గ్రామాల్లో శనివారం మొహర్రం ఉత్సవాలు కొనసాగాయి. వేడుకల్లో భాగంగా 7వ ఇమామ్, కాశీం పీర్లను వీధుల గుండా ఊరేగించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

అదేవిధంగా, ధన్వాడలో పీర్లను శనివారం పురవీధుల గుండా ఊరేగించారు. పెద్ద ఖాసీం సాబ్, చిన్న ఖాసీంసాబ్ పీర్ల సవారీలో భక్తులు పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. పీర్ల పండుగ సందర్భంగా మహిళలు బొడ్డెమ్మలు, పురుషులు అలాయి ఆడారు.

ఘనంగా గోరింటాకు ఉత్సవం

మక్తల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక గోరింటాకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మన్నాని సరళ, లంకాల సుజాత, ప్రసన్న తదితరులున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

నారాయణపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. శనివారం జిల్లాలో నమోదైన వర్షపాతంలో అత్యధికంగా ఊట్కూర్ మండలంలో 28.0 మి.మీ., అత్యల్పంగా మక్తల్ మండలంలో 0.8 మి.మీ. నమోదైంది. మాగనూర్ మండలంలో 17.8 మి.మీ., ధన్వాడలో 14.8 మి.మీ., నారాయణపేట మండలంలో 11.3 మి.మీ., కొత్తపల్లిలో 9.0, నర్వలో 6.3, కృష్ణలో 5.0, మద్దూర్‌లో 4.3, మరికల్‌లో 2.8, కోస్గిలో 2.5, గుండుమాల్‌లో 1.3, దామరగిద్ద మండలంలో 1.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

సబ్‌స్టేషన్ తనిఖీ



సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను పరిశీలిస్తున్న డీఈ నరసింహరావు

కోస్గి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కోస్గి, గుండుమాల్ మండలాల్లోని సబ్‌స్టేషన్లను నారాయణపేట డీఈ నరసింహరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా సబ్‌స్టేషన్లలో విద్యుత్ ఫీడర్ పరిధిలో సరఫరా అంతరాయాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో ఈదురుగాలుల వల్ల ఏర్పడే అంతరాయాలపై అప్రమత్తంగా ఉండి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి 11 కేవీ విద్యుత్ సరఫరా పనులు పూర్తయినందున సిబ్బందిని అభినందించారు. ఏఈ వెంకటేష్, లైన్‌మెన్లు ఉన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, కుర్చీల వితరణ

మక్తల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలకు ప్రముఖ వ్యాపారవేత్త వట్టం రతన్ కుమార్‌గుప్తా నోటుపుస్తకాలు, పెన్నులు, కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశుమందిర్‌లో తాను చదువుకున్నానని, పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయం చేస్తానన్నారు. అనంతరం పాఠశాల కమిటీ సభ్యులు రతన్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వట్టం పుష్పవతి, అనూష, హెచ్‌ఎం కురుమయ్య, కమిటీ సభ్యులు కావలి వెంకటేష్, ప్రతాప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మన్నాని నాగరాజు, వనితాక్లబ్ అధ్యక్షురాలు మన్నాని సరళ, కార్యదర్శి లంకాల సుజాత, ప్రసన్న ఉన్నారు.

కొత్త పాఠశాలలు ఏర్పాటు చేయాలని డీఈవోకు వినతి

మక్తల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని బీసీ కాలనీ, జగ్జీవన్‌రాం కాలనీల్లో కొత్త పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరుతూ డీటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు హైమావతి కోరారు. శనివారం నారాయణపేట జిల్లా విద్యాధికారి గోవిందరాజులుకు ఆమె వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని బీసీ కాలనీల్లో గత ఏడాది 120 మంది విద్యార్థులతో పాఠశాల కొనసాగించారన్నారు. ప్రస్తుతం పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. సంగంబండ రోడ్‌లోని జగ్జీవన్‌రాం కాలనీలో కూడా పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అలాగే మంథన్‌గోడ్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్ కొరత ఉందని, ఖానాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు డీఈవోకు వివరించారు. స్పందించిన డీఈవో పాఠశాలల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

దివ్యాంగుల పింఛన్లు మంజూరు చేయాలి



మాగనూరులో తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

నారాయణపేట రూరల్/ధన్వాడ/మాగనూరు/కృష్ణ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెండింగ్ పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ అమరేంద్రకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాశప్ప, మండల ప్రధాన కార్యదర్శి బస్వరాజ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో 43 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని వారు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేయూత పింఛన్ కోసం 24.85 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అలాగే, పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మునిసిపాలిటీలలో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో చట్టం తేవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాల్‌రాజ్, హన్మంత్‌రెడ్డి, లక్ష్మణ్, హన్మంతు, హన్మంత్‌రావు తదితరులున్నారు.

అదేవిధంగా, దివ్యాంగుల సంఘం ధన్వాడ ఆధ్వర్యంలో తహసీల్దార్ సింధూజకు వినతి పత్రం అందించారు. చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ మంజూరు చేయలేదన్నారు. సంఘం మండల అధ్యక్షుడు కెంచె రంగయ్య, కుమ్మరి కుర్మన్న, కెంచె వెంకటేష్, బాల్‌చందర్, పెంటయ్య తదితరులున్నారు.

మాగనూరులో తహసీల్దార్ నాగలక్ష్మికి దివ్యాంగులు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన రూ.6 వేల పెన్షన్ వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు పుంజనూరు బాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్కూరు రవి, లక్ష్మినారాయణ, లింగటి వాబయ్య, వెంకటప్ప తదితరులున్నారు.

కృష్ణలో దివ్యాంగులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణ, వెంకటేష్, హనుమంతు, హేమలత, జగదీష్, అంజప్ప ఉన్నారు.

ఆయిల్‌పామ్ లక్ష్య సాధనకు చర్యలు చేపట్టాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

» కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు కోసం నిర్ధేశించిన 3500 ఎకరాల లక్ష్యాన్ని ఉద్యానశాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు సమన్వయంతో రైతులను గుర్తించి లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉద్యానశాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయిల్‌పామ్ సాగుపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు నిర్ధేశించిన 3500 ఎకరాలకు ఇప్పటివరకు 54 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను నాటడం జరిగిందన్నారు. ఆయిల్‌పామ్ తోటల సాగుపై రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఉన్నత స్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులను గుర్తించడంతో పాటు వారికి తోటల సాగుతో వచ్చే లాభాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఒక్కో మండల వ్యవసాయ అధికారికి 50 ఎకరాల టార్గెట్‌ను కలెక్టర్ నిర్ధేశించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు రామలక్ష్మి, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ ప్రత్యేకాధికారి సత్యనారాయణ, జిల్లా ఉద్యానవన, పట్టు పురుగుల పెంపకం అధికారి సాయిబాబ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్, వ్యవసాయ శాఖ డీడీ రాజారత్నం, అన్ని మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

గురుకులాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి..

గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వసతి సౌకర్యాలను కల్పించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శనివారం జిల్లా కేంద్ర సమీపంలోని సింగారం చౌరస్తాలో ఉన్న గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి, పాఠశాలలో ప్రస్తుతం ఉన్న వసతులు, అవసరమైన సౌకర్యాల గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. అవసరమైన వసతి సౌకర్యాల గురించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

» అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నారాయణపేటటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ప్రతీవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో మాదక ద్రవ్యాల నిషేధంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు, ఉన్నత పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా మాదక ద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీపీవో భిక్షపతి, ఆర్డీవో మేఘాగాంధీ, డీఏవో జాన్ సుధాకర్, ఎక్సైజ్ అధికారులు, సి-సెక్షన్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం వీసీ హాల్‌లో డీఎల్ఎస్ఏ సమావేశం నిర్వహించగా అదనపు కలెక్టర్ కుల ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో తహసీల్దార్లు పాటించాల్సిన నిబంధనల గురించి తెలిపారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం



ఆర్మీ జవాన్ వెంకట్‌రాములు, తల్లిదండ్రులను సన్మానిస్తున్న గ్రామస్థులు

కోస్గి రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆర్మీలో పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన గవిండ్ల వెంకట్‌రాములును శనివారం గ్రామస్థులు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు మాట్లాడుతూ దేశ సేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. మాజీ ఎంపీపీ మధుకర్‌రావు, నాయకులు వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, డీజే కృష్ణ తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

» సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న నాగూరావు నామాజీ

నారాయణపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ అన్నారు. శనివారం నారాయణపేటలో అనారోగ్యంతో చికిత్స పొందిన బాధితులు ఐదుగురికి ఆయన ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి, మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే.అరుణ సహకారంతో మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సిద్ది వెంకట్రాములు, నందు నామాజీ, పోషల్ వినోద్‌కుమార్, మిర్చి వెంకటయ్య, శ్రీనివాస్, పవాడి మహదేవ్, కుమారస్వామి, రమేష్ తదితరులున్నారు.

ఏఐయూకేఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము

నారాయణపేటరూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న మహబూబ్‌నగర్‌లో జరిగే ఏఐయూకేఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము పిలుపునిచ్చారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు అధ్యక్షతన శనివారం పేట జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తూ రైతు వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడికి 50 శాతం అదనంగా కలిపి ధర నిర్ణయించాల్సిన కేంద్ర ప్రభుత్వం నేటికీ నెరవేర్చలేదన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి రైతులకు నష్టం చేకూరుస్తోందన్నారు. రైతాంగ సమస్యలు, ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులపై దేశ వ్యాప్తంగా ఏఐకేయూకేఎస్ నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సంఘం నాయకులు బి.యాదగిరి, వెంకట్‌రెడ్డి, కృష్ణ, నర్సిములు, నారాయణ, బాలకృష్ణ ఉన్నారు.